క్లుప్తంగా

తాగునీటికి తండ్లాట



దుగ్గొండి : ఎండాకాలం ప్రారంభ దశలోనే మండలంలోని మైసంపల్లిలో ప్రజలకు తాగునీటి తండ్లాట తప్పడం లేదు. మంచినీటి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 10 రోజులుగా నల్లాల నుంచి నీరు రాకపోవడంతో ప్రజలు అల్లాడుతున్నారు. మిషన్ భగీరథ నీరు గ్రామానికి చాలా రోజుల నుంచి సరఫరా కావడం లేదు. గతంలోని మంచినీటి బావి నుంచి కూడా సరిపడా నీరు రాని దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో నీరు అందడం లేదు. అధికారులకు మొరపెట్టుకున్నా మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. ట్రాక్టర్ సాయంతో వ్యవసాయ బావుల నుంచి డ్రమ్ముల్లో నీరు తెచ్చుకోవాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని కొత్తూరుకు చెందిన జర్నలిస్టు దొడ్డ శ్రీనివాస్‌ను అతడి తండ్రి సోమయ్య మృతి చెందిన క్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం పరామర్శించారు. సోమయ్య మృతి బాధాకరమన్నారు. జర్నలిస్టుల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సుభాష్, పూర్ణచందర్, సోమనాథం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా చంద్రమౌళి



వర్ధన్నపేట : మండలంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన జనగం చంద్రమౌళిని కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి తనకు పదవి కట్టబెట్టారంటూ హర్షం వ్యక్తం చేశారు. దళితుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడంలో సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, నరుకుడు వెంకటయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ లేఅవుట్ల హద్దు రాళ్ల తొలగింపు

ఆత్మకూరు : మండలంలోని కొత్తగట్టు గ్రామ శివారులో అక్రమంగా వెలసిన లేఅవుట్లపై అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది హద్దురాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు కల్యాణి, శ్రీకాంత్, పాల్గొన్నారు.

జీవన జ్యోతి బీమా యోజన సురక్షలో చేరాలి

గూడూరు: యూనియన్ బ్యాంకు ఖాతాదారులు ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన సురక్ష పథకంలో చేరాలని మేనేజర్ బన్సీలాల్ కోరారు. బ్యాంకు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. మండలంలోని మచ్చర్లకు చెందిన ఖాతాదారు పట్టం వెంకన్న ఆ పథకంలో చేరాక సహజ మరణం పొందడంతో వెంకన్న భార్య సత్యమ్మకు రూ.2 లక్షల బీమా డబ్బు అందజేశామన్నారు. కార్యక్రమంలో సబ్ మేనేజర్ మనోజ్‌కుమార్, బిజినెస్ కరస్పాండెంట్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

మామునూరు : 2021లో జరిగిన హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్షపడేలా కృషి చేసిన అప్పటి మడికొండ సీఐ, నేటి మామునూరు ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను బాధిత కుటుంబ సభ్యులు కృష్ణ, దివ్య శుక్రవారం సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వనంరెడ్డి, శుణ్ముఖరెడ్డి, కోటి తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రను విజయవంతం చేయాలి

ఖిలా వరంగల్ : విదేశీ విహార యాత్రను విజయవంతం చేయాలని అన్నపూర్ణ పరపతి సంఘం అధ్యక్షుడు బిట్ల సుధాకర్, ప్రధాన కార్యదర్శి బండి కోటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఏకశిల నగర్‌లోని అన్నపూర్ణ పరపతి సంఘం భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో సంఘ కార్యవర్గ సభ్యులతో కలిసి బ్యాంకాక్ యాత్ర కరపత్రాలను ఆవిష్కరించి వారు మాట్లాడారు. రెండేళ్లకోసారి సంఘం ద్వారా స్వదేశీ, విదేశీ విహార యాత్రలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ ఏడాది బ్యాంకాక్, పట్టాయా (థాయ్‌లాండ్) విహార యాత్రకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యవర్గ ప్రతినిధులు వలుప రాజమల్లు, సాంబయ్య, శ్రీధర్, వీరభద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా బలరాం గెలుపు ఖాయం

● కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్‌రావు



నర్సంపేట : బహిరంగ సభకు వెళ్తున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న రవీందర్‌రావు

నర్సంపేట : పార్లమెంట్ ఎన్నికల్లో రెండు లక్షల మెజార్టీతో బలరాంనాయక్ గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. మహబూబాబాద్‌లో తలపెట్టిన జన జాగరణ సభకు నర్సంపేట నియోజకవర్గం నుంచి శ్రేణులతో బయల్దేరిన బస్సును శుక్రవారం ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని తెలిపారు. ఎంపీగా బలరాంనాయక్ గెలుపు కోసం శ్రేణులు ఐక్యతతో పని చేస్తున్నారని వివరించారు. అవినీతి పాలన సాగించిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రస్తుతం చెల్లని పైసగా మిగి లిందని, డిపాజిట్లయినా దక్కించుకోవాలని కేసీఆర్ తాపత్రయ పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సాంబయ్యగౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, దండెం రతన్‌కుమార్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అఖిల్, నాయకులు కటారి ఉత్తమ్ కుమార్, ఓర్సు సాంబయ్య, వెంకన్న, సారంగంగౌడ్ పాల్గొన్నారు.

ఖానాపురం : జనజాతర సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, మైనార్టీ సెల్ నాయకుడు ముస్తఫ, చెడిపాక ఉపేందర్‌ల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు.

నెక్కొండ : సభకు బయల్దేరిన వాహనాలను మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, నాయకులు కేవీ.సుబ్బారెడ్డి, గైలక్ష్మణ్, మెండె కుమారస్వామి, కర్ర చెన్నారెడ్డి, బొడ్డుపల్లి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలం నుంచి పలువురు కాంగ్రెస్ నాయకులు సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సిద్దన రమేశ్, తప్పెట రమేశ్, రాజేందర్, వీరూ, వెంకన్న, శ్రీను, సుదర్శన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేవూరి సమక్షంలో చేరితేనే గుర్తింపు!

● 'కొండా' వెంట ఉన్న వారికి నో ఎంట్రీ

గీసుకొండ : మండలంలో కాంగ్రెస్ పార్టీలో వింత పరిస్థితి నెలకొంది. నాయకులుగా, క్రియాశీల కార్యకర్తలుగా ఉండాలంటే ముందుగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆశీస్సులు పొందాలి. ఆయన నాయకత్వంలో పని చేయడానికి సిద్ధంగా ఉన్న వారికే ఆ అవకాశం దక్కుతోంది. గతం నుంచి కాంగ్రెస్‌లో ఉన్న వారైనా రేవూరి గొడుగు కిందకు రావాల్సిందే. కొత్తగా ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధపడే వారైనా, లేదంటే గతం నుంచి కొండా దంపతుల వెంట ఉండి కాంగ్రెస్‌లో కొనసాగుతున్న వారికైనా ఇవే షరతులు వర్తిస్తున్నాయని తెలుస్తోంది. 'తాను ఇతర నియోజకవర్గ రాజకీయాల్లో తలదూర్చను.. నా నియోజకవర్గంలో ఇతరులు తలదూర్చవద్దు' అనే రీతిలో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి వైఖరి ఉందని ఆ పార్టీ నాయకులే వ్యాఖ్యానిస్తున్నారు. బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేయాలని, అందులోని వారిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఇటీవల మండలంలో జరిగిన పలు సమావేశాల్లో ఎమ్మెల్యే తెలిపారు. దీంతో చాలా మంది ఆయన నాయకత్వంలో కాంగ్రెస్‌లో చేరుతున్నారు. అయితే కొండా వెంట ఉన్న వారి నీడ కూడా పార్టీలో పడవద్దనే తీరు కనిపిస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా వ్యవహరించిన కొండా దంపతుల అనుచరుడు రడం భరత్ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో మళ్లీ చేరేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. పైగా ఆయనపై ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికాంలోకి రాగానే కొండా దంపతుల అభిమానులు, గతం నుంచి వారి వెంట కాంగ్రెస్‌లో ఉన్న వాళ్లందరూ వారిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపిన సందర్భాలు అనేకం. అలా వెళ్లిన వారికి మండలంలో పార్టీలోకి ఎంట్రీ ఇవ్వడానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఒకే పార్టీ.. ఒకే నాయకత్వంగా మండలంలో కాంగ్రెస్ తీరు కనిపిస్తోంది. వరంగల్ నగరంలో ఎంపీ ఎన్నికల కోసం గురువారం జరిగిన తూర్పు నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మండలంలోని పలువురు నాయకులు కొండా దంపతుల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అయితే వారికి మండలంలో ఎంట్రీ లేదంటూ రేవూరి వర్గీయులు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో తేటతెల్లం చేశారు. పార్లమెంటు ఎన్నికల వేళ కొండా, రేవూరి వర్గాల మధ్య సమన్వయం కుదురుతుందో? మరింత ముదురుతుందో? వేచి చూడాల్సిందే.

కంఠమహేశ్వరుడికి జలాభిషేకం



దుగ్గొండి : జలాభిషేకానికి వెళ్తున్న రమేశ్, గౌడ కులస్తులు, గీత కార్మికులు

దుగ్గొండి : మండలంలోని వెంకటాపురంలో బోనాల వేడుకల్లో భాగంగా కంఠమహేశ్వరుడికి గౌడ కులస్తులు శుక్రవారం ఘనంగా జలాభిషేకం నిర్వహించారు. గౌడ కులస్తులు, గీత కార్మికులు బిందెల్లో నీళ్లు నింపి పసుపు, కుంకుమ, తదితరాలతో అలంకరించి ర్యాలీగా ఆలయానికి చేరుకుని జలాభిషేకం చేశారు. మహిళలు మంగళహారతులతో వచ్చి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. కంఠమహేశ్వరుడు గౌడ కులస్తులకు ఆరాధ్య దైవమని చెప్పారు. ఆయన ఆశీస్సులతో గౌడ కులస్తులు, గీత కార్మికులు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు పొగాకు కృష్ణమూర్తి, కక్కెర్ల సాంబయ్య, బొమ్మగాని సదానందం, పొగాకు సదయ్య, గుండెబోయిన సాంబయ్య, సుధాకర్, ముత్యాల వెంకన్న, గడ్డమీది శివశంకర్, రాజేశ్, సమ్మాలు, వెంకట్‌గౌడ్, నరేశ్, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దేవతా విగ్రహాల ఊరేగింపు



పర్వతగిరి : విగ్రహాలను ఊరేగిస్తున్న సభ్యులు

పర్వతగిరి : మండల కేంద్రంలోని శ్రీకంఠమహేశ్వర స్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయం నుంచి విఘ్నేశ్వర, కంఠమహేశ్వర, ఎల్లమ్మ, సులమాంబ, కోడిపుంజు దేవతల విగ్రహాలను అల్లూరి సీతారామరాజు సెంటర్ నుంచి పర్వతగిరి చౌరస్తా, గౌడ సంఘం కాలనీ, నెక్కొండ రోడ్డు, బస్టాండ్ మీదుగా శ్రీకంఠమహేశ్వర స్వామి ఆలయం వరకు డప్పుచప్పుళ్లు, డీజే సౌండ్‌ల నడుమ శుక్రవారం వేడుకగా ఊరేగించారు. కంఠమహేశ్వర స్వామి మాలధారణ చేసిన భక్తులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేశారు. అనంతరం మహిళలు విగ్రహాలకు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కంఠమహేశ్వరస్వామి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తీగల వీరస్వామి, గౌడ సంఘం అధ్యక్షుడు పుల్లూరి సారయ్య, గౌరవ అధ్యక్షులు రంగు జనార్దన్, రంగు కుమార్, ఉపాధ్యక్షుడు దయాకర్, శ్రావణ్, వడ్డీ వెంకన్న, చిర్రా శేఖర్, రంజిత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు అభినందన



గీసుకొండ : మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన సయింపు కిరణ్ సివిల్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన క్రమంలో ఆయన్ను ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్, ఎస్సై వెంకన్న శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో కిరణ్ తండ్రి ప్రభాకర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రేవూరి వెంట నడిచే వారికే ప్రాధాన్యం

గీసుకొండ : కాంగ్రెస్ బలోపేతం దిశగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వెంట నడిచే వారికే పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని కోనాయమాకుల వద్ద ఎంపీపీ భీమగాని సౌజన్య, పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, గ్రామ కమిటీల నాయకులతో శుక్రవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో కొమురారెడ్డి మాట్లాడారు. రేవూరి నాయకత్వంలో పని చేయడానికి ఆయన సమక్షంలో పార్టీలో చేరే వారికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని తెలిపారు. పరకాల నియోజకవర్గంతోపాటు గీసుకొండ మండల అభివృద్ధికి ఎమ్మెల్యే రేవూరి నాయకత్వంలో పని చేయాలని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొమురారెడ్డి

ఎంపీగా పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కూసం రమేశ్, దూల వెంకటేశ్వర్లు, ఆకుల రుద్రప్రసాద్, పత్తిపాక రవీందర్, వజ్ర రాజు, మండల కోఆప్షన్ సభ్యులు రహీం, దౌడు ప్రవీణ్ పాల్గొన్నారు.

అరూరి గెలుపే లక్ష్యంగా పని చేయాలి

వర్ధన్నపేట : లోకసభ ఎన్నికల్లో బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు ఇల్లందుల సుదర్శన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి రాజేశ్వర్‌రావు కోరారు. మండలంలోని కట్ర్యాలలోని శక్తి కేంద్రం పరిధిలోని మూడు బూత్‌లకు సంబంధించిన కమిటీలు, ముఖ్యకార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ చెంగల సురేశ్ అధ్యక్షత వహించగా సుదర్శన్, రాజేశ్వర్‌రావు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గడచిన పదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలు అవినీతి అక్రమాలతోనే గతంలో పాలన సాగించాయని గుర్తు చేశారు. మళ్లీ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తొలుత కార్యకర్తల నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. సమావేశంలో నాయకులు రాయపురం కుమారస్వామి, జడ సతీశ్, కుందూరు మహేందర్‌రెడ్డి, గుడ్ల సుభాశ్, పింగిళి సంపత్‌రెడ్డి, పెద్దిరెడ్డి, మల్లారెడ్డి, ఏలపాటి తిరుపతిరెడ్డి, నాంపెల్లి కుమార్, ఇటికాల ప్రశాంత్, పింగిళి నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : మాట్లాడుతున్న సుదర్శన్



వర్ధన్నపేట : ప్రచారం చేస్తున్న నాయకులు

ఇంటింటా ప్రచారం

వర్ధన్నపేటలో కౌన్సిలర్ కొండేటి అనిత సత్యం ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. అరూరి రమేశ్‌ను గెలిపిస్తే నిత్యం ప్రజల్లో ఉంటూ సేవలు అందిస్తారని చెప్పారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటు పడతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు గిరిప్రసాద్, విక్కి, వేణు, గణేశ్, అశోక్, శ్రీనివాస్, నజీర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పెర్కవేడులో..



రాయపర్తి : ప్రచారం చేస్తున్న అనిల్, నాయకులు

రాయపర్తి : మండలంలోని పెర్కవేడులో బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ నిమ్మల అనిల్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడారు. ఎంపీగా రమేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అబ్బోజు సుధాకర్, బూత్ ఇన్‌చార్జ్ రాకేశ్ పాల్గొన్నారు.

బహుజన రాజ్యస్థాపనకు ఉద్యమించాలి



నర్సంపేట రూరల్ : నివాళులర్పిస్తున్న నాయకులు



రాయపర్తి : స్తూపానికి..

నర్సంపేట రూరల్ : ఎంసీపీఐ(యూ) నేత గౌస్ ఆశయ సాధన కోసం బహుజన రాజ్యస్థాపన కోసం ఉద్యమించాలని జిల్లా కమిటీ సభ్యుడు కొత్తకొండ రాజమౌళి పిలుపునిచ్చారు. మండలంలోని మాదన్నపేటలో గౌస్ మూడో వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. గౌస్ చిత్రపటానికి రాజమౌళి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజమౌళి మాట్లాడారు. గౌస్ సిద్ధాంతం మేరకు ప్రజాపోరాటాల నిర్మాణంలోనే తుది శ్వాస విడిచే వరకు పాటుపడ్డాడని తెలిపారు. కేంద్రంలోని ప్రస్తుత బీజేపీ మతోన్మాదంతో ప్రజాసమస్యలను పక్కదోవ పట్టిస్తూ పబ్బం గడుపుతోందని ధ్వజమెత్తారు. దోపిడీ శక్తులను కూల్చే దిశగా వామపక్ష, లౌకిక శక్తులు ఏకతాటిపైకి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కౌెట్టి సదానందం, కౌెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కర్ని సాంబయ్య, కౌెట్టి సూరయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

స్తూపానికి నివాళి

రాయపర్తి : మండలంలోని గౌస్ స్తూపానికి ఎంసీపీఐ(యూ) నాయకులు పెద్దారపు రమేశ్, గోనె కుమారస్వామి, మంద రవి నివాళులర్పించారు. గౌస్ పేదల కోసం చేసిన పోరాటాన్ని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కన్నం వెంకన్న, రామబ్రహ్మం, కందికొండ కుమారస్వామి, ఇస్మాయిల్, జన్ను రమేశ్, సుబ్బారావు, గణేశ్, ఎల్లయ్య, మల్లయ్య, భిక్షపతి, లతీఫ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎస్‌ఏ-2 పరీక్షలు నిర్వహించాలి



పర్వతగిరి : సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-2) పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని మండల నోడల్ ఆఫీసర్ గాయపు లింగారెడ్డి కోరారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ), మోడల్ స్కూల్, విజ్‌డమ్ స్కూల్, లయోలా పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించి పరీక్షల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించి మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం ఎస్‌ఏ-2 పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. ఎండాకాలం నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. అలాగే సకాలంలో మూల్యాంకనాన్ని పూర్తి చేసి పాఠశాలల చివరి పని దినం రోజున విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ కార్యాలయ సీసీఓ జయరాజ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ సన్మానం



సదాశివరావును సన్మానిస్తున్న నోడల్ అధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

నల్లబెల్లి : మండలంలోని శనిగరంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు ఉప్పు సదాశివరావును ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా సదాశివరావు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. సదాశివరావు శేష జీవితాన్ని ఆరోగ్యంగా, ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నటరాజ్, ఉపాధ్యాయులు సుధాకర్, మహేందర్, సుధారాణి, మంజుల, వసీలా సుల్తానా, సీఆర్పీ రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్, వార్డెన్‌పై చర్య తీసుకోవాలి

గూడూరు : మండలంలోని దామరవంచ గిరిజన బాలుర గురుకుల విద్యాలయంలో విద్యార్థిపై జరిగిన దాడి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్, వార్డెన్‌పై చర్య తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోనగిరి మధు డిమాండ్ చేశారు. ఆ పాఠశాల వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల 8వ తరగతి విద్యార్థి తరుణ్‌పై 9వ తరగతి విద్యార్థి దాడికి పాల్పడినట్లు తెలిపారు. తరుణ్ తలకు గాయమై కుట్లు పడ్డాయని చెప్పారు. జిల్లా అధికారులు స్పందించి ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాల నివారణ



అవగాహన కల్పిస్తున్న భద్రయ్య, సిబ్బంది

వర్ధన్నపేట : అవగాహన కలిగి ఉండడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించగలమని డివిజనల్ అగ్నిమాపక అధికారి భద్రయ్య స్పష్టం చేశారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని సినిమా హాలులో, ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. అగ్ని ప్రమాదం సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రమాద తీవ్రత, పరిస్థితిని బట్టి స్పందించాలని సూచించారు. ప్రమాదాలు జరిగిన వెంటనే సత్వర చర్యలు చేపట్టడంతోపాటు సమీపంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలని కోరారు. ఎంత త్వరగా సమాచారం ఇస్తే అంత ఎక్కువగా నష్టాన్ని నివారించొచ్చని తెలిపారు. సమాజంలోని ప్రతీఒక్కరూ అగ్ని ప్రమాదాల నివారణ దిశగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలన్నారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం పోస్టర్లను అంటించారు. పలు సూచనలు, సలహాలు అందించారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు

గూడూరు: సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చని వరంగల్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజు తెలిపారు. మండలంలోని కొల్లాపురంలో బీఎస్సీ అగ్రికల్చర్ చివరి సంవత్సరం విద్యార్థులకు జాతీయ సేవా పథకం కింద ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.రాజు భూసార పరీక్షల ప్రాముఖ్యతపై రైతులకు వివరించారు. మట్టి నమూనాలను సేకరించే విధానాన్ని ప్రాక్టికల్‌గా చూపించారు. ఈ సందర్భంగా వర్మి కంపోస్టు, సేంద్రియ వ్యవసాయం లాభాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ జె.భార్గవి, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో ఆదర్శంగా నిలవాలి



వర్ధన్నపేట : విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆ శాఖ డివిజనల్ ఇంజనీర్ (టెక్నికల్) ఆనందం కోరారు. పట్టణంలోని పుస్కోస్ స్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫీల్డ్ స్టాఫ్‌కు ఆయన శిక్షణ ఇచ్చారు. సిబ్బంది 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్లను నిరంతరం పెట్రోలింగ్ చేయాలని చెప్పారు. పవర్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ప్రతీనెల 33/11 కేవీ సబ్ స్టేషన్లలో సమస్యలు నివారించాలని తెలిపారు. వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించాలని కోరారు. సమావేశంలో వరంగల్ డీఈ భిక్షపతి, వర్ధన్నపేట ఏడీఈ రాజు, తదితరులు పాల్గొన్నారు.